# ఉరి

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ



నాకు మీరు ఉరిశిక్ష వేశారు. నన్ను చెప్పుకునేది చెప్పుకోమన్నారు. శిక్ష వేయకముందు చెప్పుకోమంటే అర్థం ఉండేది. ఇప్పుడు చెప్పుకొన్నా ఒకటే చెప్పుకొనకపోయినా ఒకటే. కాని మీరిప్పుడు చెప్పుకోమనటంలో ఒక విశేషం ఉంది. ఎట్లాగూ చస్తున్నాడుకదా చచ్చింతర్వాత మాట్లాడేదిలేదు పెట్టేదిలేదు. ఆ మాట్లాడేది కాస్తా యిప్పుడే మాట్లాడమని. మనుష్యుడై జన్మయెత్తినతర్వాత మాట్లాడటంలో కొంత లౌకికమైన సంతోషం ఉంటుంది. అది మాయాపిహితులైన మానవులకు సహజలక్షణం. మీకు నా శరీరంమీద ప్రేమలేదు. నా ఆత్మమీద ప్రేమ. నా ఆత్మ మీ ఆత్మలు అందరివి ఒకటేగనుక. అయినా కాకపోయినా మీరనుకొంటున్నారు గనుక యిది ఒక మామూలు.

ఇప్పుడు నేను మాట్లాడకపోతే నష్టంలేదు. మాట్లాడితే వచ్చే లాభంలేదు. కాని నేను మాట్లాడితే లాభం ఉంటుందని కొందరనుకొంటారు. వాళ్ళ ఉద్దేశంలో మాట్లాడవలసిందే. ఏమైనాసరే మాట్లాడవలసిందే. బ్రతికియున్నంతవరకు ప్రయత్నం చేయవలసిందే. బ్రతికిఉన్నంతమంది ప్రయత్నం చేయవలసిందే. వాళ్లు మీకన్న మాయాపిహితులు.

నేను మనిషిని చంపానని మీరు నాకు ఉరిశిక్ష వేశారు. ఆ చంపానన్నది నాకు తెలియదు మీకూ తెలియదు. చంపానని సాక్ష్యం యిచ్చినవాళ్ళకీ తెలియదు. నాకు తల్లీ పెళ్లాం బిడ్డలు ఉన్నారు. వాళ్ళను పోషించలేక నేను చాలా బాధపడ్డా. వాళ్ళకు తిండిలేదు నాకూ తిండిలేదు. మీ దయవల్ల రెండునెలలనుండి ఖైదులో కూర్చొని అన్నంమాత్రం తిన్నాను. ఈ రెండునెలలు వాళ్లేమైనారో నాకు తెలియదు. ఈపాటికి వాళ్లు చచ్చేఉంటారు. వాళ్ళకన్న నేనే అదృష్టవంతుణ్ణి. వాళ్లు చావకముందు మాడిమాడి చచ్చిఉంటారు. నేను చచ్చేముందు ఏదో యింత అన్నంతినే చస్తున్నా.

నేను ఉద్యోగం చేయలేదు. కూలినాలి కుదరలేదు. మోసం చేయలేను. ఎక్కడో నాలుగురాళ్లు సంపాదిస్తే దాంతో బియ్యం కొనుక్కుందామంటే బియ్యం దొరకలేదు. అదివరకు నాల్గురోజులు ఇంటిల్లిపాదికా పస్తున్నాం. నేను నా భార్య ఎల్లాగో అల్లాగ తమాయించుకున్నాం. పిల్లలు బక్కచిక్కి కూర్చున్నచోటునుంచి లేవలేక యేడ్చేశక్తిగూడా లేక బ్రతికిఉన్నశవాలల్లే పడిఉంటే చూడటం యెలాగా?

బియ్యంఅమ్మే దుకాణం పెద్దపుల్లల్లే ఇరవై గజాలతోక పెంచుకొని ఆ తోకచివర నేను. నాలుగురోజులు ఆ తోకచివరితనం పోందలేక పోందలేక విసిగి చివరికి యింటికివచ్చాను. ఒక ముసలిది నామీద దయపుట్టి తనకు వచ్చిన బియ్యంలో సగం నాకు రెట్టింపుధరకు అమ్మింది. ఆ బియ్యం తీసికొనివచ్చి వండి పిల్లలకు పెడ్దామంటే అవి గొడ్లు తినాలిగాని మనుష్యులుతినరు. నాలుగుపోట్లువేసి చెరిగి తినేగాని సంధటానికి

పనికిరావు. దంచాలి అంటే నాలుగురోజులు తిండిలేని మా యింటిదానికి ఓపికలేదు నాకూ లేదు అయినా పిల్లలస్థితిచూడలేక మా యింటిది ఆ బియ్యం చిరిగిన చీరకొంగున కట్టుకొని పది కొంపలు తిరిగింది. ఒకళ్లు విసిరికొట్టారు, మరి ఒకళ్లు—వాళ్ళయింట్లో నోమట. అట్లాకోసం పిండి దంచుకొంటున్నారు. అన్నియిళ్లూ ఇట్లాగే అయినవి. చివరకా బియ్యమే ప్రొయ్యిరాళ్ళమీద పెట్టింది మా యింటిది, ప్రొయ్యిక్రింద మంట లేదు. ఒకాయన దొడ్డిచుట్టూ కంచెవేశాడు. ఆ కంచె గాడిదలూ, కుక్కలూ, పందులూ విరగ తొక్కినవి. కంచెపుల్లలు ఇటుఅటు పడిఉన్నవి, అవి యెవరికీ పనికిరావు. అవి నేను ఏరితెస్తూంటే ఒకాయన "ఎవడి అమ్మామొగుడి సొమ్మను కొన్నావు" అనివచ్చి నన్ను కఱ్ఱతో విరగ కొట్టారు.

ఇంటికివచ్చాను, ఇల్లంటే నవ్వు వస్తోంది. ఎవదో పడిపోయినగోడ ఉంటే ఆ స్థలంలో యెవళ్లూ కాపరానికిలేరు ఆ గోడక్రింద ఉంటు న్నాం, అదేయిలు, పైన పుల్లాపుడకాపెట్టి తలలు మాత్రం దానిక్రిందపెట్టి నిద్రపోయేటట్లుగా మా యింటిది ఆధారంచేసింది; నేను వెళ్లేటప్పటికి ఆ అధారంతీసి దానితో మంటవేస్తోంది. ఈ ఆధారం ఎక్కువా? పిల్లల కడుపుమంట యెక్కువా?

మరునాడు మా పిల్లలస్థితిచూడ కడుపులో నొప్పితో మెలితిరిగిపోయినారు. నాలుగు వాము పరకలు తెద్దామంటే చేతిలోఉన్న నాలుగణాలు విన్నటిమువలమ్మే కాజేసింది. మళ్లీ తర్వాత నాలుగురోజులవరకు బియ్యం లేవు, పిల్లల కడుపునొప్పులూ తగ్గలేదు. మా యింటిది లేవనే లేకపోయింది. నే నట్లాగే తిరుగుతున్నాను.

ఆ రోజున మధ్యాహ్నం జనం గుంపులుగా వెళ్తున్నారు. నేను వాళ్లెక్కడికి వెళ్తున్నా




లాయరు కుమార్తె: (లాయరుతో) మన ఇంట్లో పనిచేసేందుకు ఇంత కురూపిని ఎందుకు పెట్టాయ నాన్నా.

లాయరు: అదికాదమ్మా! రేపు వీడు ఇక్కడ ఎదన్నా పట్టుకు పారిపోయినా గుర్తుపట్టి పట్టుకోవటానికి ఎంత వీలుగావుంటుందో ఆలోచించావా!

---

రని అడిగాను అందరికీ బియ్యం ఇస్తారట అని చెప్పారు నేను వాళ్ళవెంట వెళ్లాను, వాళ్లు వందా రెండువందలమంది ఉన్నారు జనం ఒకచోటికి వెళ్లారు. జనం కేకలూ బొబ్బలూ నానా హంగామాగా ఉంది. ఒక యింటిదగ్గర ఆగారు. ముందర యేమిజరుగుతోందో నాకు తెలియదు నేను వెనకఉన్నాను. బియ్యంకోసం త్రొక్కులాడుతున్నారనుకొన్నాను. చుట్టుపక్కల యిళ్ళవాళ్ళందరూ కొందరు తలుపులు వేసికొన్న వాళ్లు కొందరు తొంగిచూచేవాళ్ళుగా కప్పించారు.

కొంతసేపటికి రక్షకభటులు వచ్చారు. నే ననుకొన్నాగదా "అమ్మయ్యా వీళ్ళువచ్చారుగదా అందరికి సరిగ్గా పంచిపెట్టిస్తారు" అని,

క్రమక్రమంగా నాకుతెలిసింది ఈ గుంపుకి ఆ రక్షకభటులకీ దెబ్బలాట జరుగుతోందని.

ఇంతిలో రక్షకభటులు తుపాకులు కాల్చారు. ఈ గుంపులోంచి రక్షకభటులమీద రాళ్ళు విసరుతున్నారు.

వ్యవహారం యెప్పుడైతే ముదిరిందో నా కెందుకురాబాబూ ఇది పోదామనుకొన్నాను. కాని పోవటమెట్లా? అడవరకు వెల్లాళ్లమట్టి తిండే లేదు. వారానికొకసారి యేదో తినీతిననట్లు తిన్నా. నా వంట్లో ఓపికలేదు మనిషిని మరీ అబ్బా కారిని కాదుగనుక మనుష్యాకృతిలో లోపంలేదు.

రక్షకభటులలో కొందరికి దెబ్బలు తగిలినవి ఒకడికి రాయి నెమరకణతను తగిలిచచ్చాడు. ఆ రాయి ఆ చుట్టుప్రక్కలవాడెవడు విసిరాడో నాకు తెలియదు

పైగా చంపడంలో యిన్ని భేదాలేమిటి? రాయితగిలితే చచ్చి, తుపాకుగుండు తగిలితే బ్రతుకుతాడా? తుపాకీగుండు తగిలిస్తే శిక్ష లేదూ! రాయితగిలిచస్తే శిక్ష?

ఆ కళ్ళులేనిదేవుడు ఆ రాయి నేనే విసిరానన్నాడు. రాయి విసరటంమాట అట్లా ఉంచండి. నేను చేయి యెత్తగలిగితేచాలు! ఆ స్థితిలో ఉన్నాను. రక్షకభటులు తరిమారు. అందరూ పారిపోతున్నారు. నేనూ పారిపోతున్నాను. పరిగెత్తేందుకు నాకు ఓపికయేది? వెనకనుంచి నా నెత్తిమీద పెద్దదెబ్బపడ్డట్టుగా మాత్రమే నాకు తెలుసు.

ఒక రాత్రివేళ నాకు మెలకువ వచ్చింది. గాఢాంధకారంలో కూర్చొనిఉన్నా. మరునాటి ప్రొద్దుటికి తెలిసింది నాకు అది ఖైదని.

ఒకటిరెండు పూటలైనతర్వాత నాకన్నం పెట్టారు. అన్నందొస్తే నా ప్రాణాలు లేచి వచ్చినవి వెంటనే పిల్లలు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళకుపెడదామని అన్నం అట్టే పెట్టాను. మరునాటికి తెలిసింది యింక వాళ్ళు నా దగ్గరకు రారని.

వాళ్ళేమైనారో? ఏమైనారో యెవడికికావాలి?

పూటపూటా అన్నంతినటం నాకూ అలవాటైంది.

నాపని రాజభోగంగా ఉంది రెండుపూటలా తిండి. ఎక్కడికైనా తీసికొనివెళ్లితే మోటారు కారులో తీసికొనివెళ్లారు పెద్దకోర్టల్లోకూడ నా కోసం ఒక ప్రత్యేకస్థానం చివరిరోజుల్లో నాకు దశయెత్తుకొంది. ఆ పాడుదేవుడు ఈమాత్రంగా ఆ వెనుకకూడా సాగిస్తే యెంతబాగుండేది.

ఇంతకన్న యేమిచెప్పను? నాకు ఇంత ఉపకారంచేసిన మీరు వెయ్యేళ్లు బ్రతకండి. బ్రతుకంతా తిండిలేక చచ్చిన నాకు రెండునెలలు సుఖంగా తిండిపెట్టారు మీ కడుపులు చల్లగా ఉండాలి

కాని నా యింటిదీ, పిల్లలు ఏమైనారో తెలియలేదు. నాకు ఒక్కటే చింతగాఉంది. నాపిల్లలు కొంచెం పెద్దవాళ్ళు అయితే—ఎల్లాగో అల్లాగా పెద్దవాళ్ళు అయితే చివరిరోజుల్లో వాళ్ళకుగూడా నాకుపట్టినయోగం పడుతుందా అని.

అదంతా మీదయ, వాళ్ళనిపెదికించి యీ ఉపకారంచేయిస్తే మీ కడుపున పుట్టాను.